ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 46
సంచిక : 175
పేజీలు : 4

బుధవారం, మార్చి 18, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదల

### -మంత్రి తుమ్మల ఆదేశం



**టీ మీడియా,మార్చి17, పెనుబల్లి** :మండలం లోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్దార్థతో మంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

మిగతా 4లో

# గుండాలలో కలెక్టర్ తనిఖీలు

### సేవల నాణ్యతపై సమగ్ర సమీక్ష

### -- ఏకలవ్య పాఠశాల ఏజెన్సీకి హెచ్చరిక

**టీ మీడియా,మార్చి17,గుండాల** :మండలంలో ప్రభుత్వ సేవల నాణ్యతను సమీక్షించేందుకు జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా విద్య, వైద్యం, పశుసంవర్ధక మరియు పరిపాలన రంగాలకు సంబంధించిన పలు సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.గుండాల మండలం ముతాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులు, ఆర్ఓ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, పాలు సరఫరా, పరీక్షల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.పరిశీలనలో పాఠశాలలో పరిశుభ్రత లోపాలు, కిచెన్ షెడ్‌లో అస్వచ్ఛత, వంట ప్రాంగణంలో నిర్లక్ష్య నిర్వహణ, సిబ్బంది కొరత, కంప్యూటర్ ల్యాబ్‌లో దుమ్ము పేరుకుపోవడం, మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడం వంటి అంశాలను గమనించి కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, "రెండు రోజుల్లో పాఠశాలలో ఉన్న అన్ని లోపాలను పూర్తిగా సరిచేయాలి. లేనిపక్షంలో ఏజెన్సీ



గుర్తింపును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చే చర్యలు తీసుకుంటాం" అని కఠినంగా హెచ్చరించారు. ఉదయం వండిన ఆహారాన్ని సాయంత్రం వరకు నిల్వ ఉంచకుండా, ప్రతి భోజనం తాజాగానే వండించి నాణ్యతతో అందించాలని స్పష్టం చేశారు.అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడి వారు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రధానంగా వచ్చే కేసులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలిస్తున్న ఆసుపత్రులపై ఆరా తీశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల గది, ఇంజెక్షన్ రూమ్, స్టోర్ రూమ్, రక్త పరీక్షల గది తదితర విభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను సమగ్రంగా తనిఖీ చేశారు. డెంగ్యూ పరీక్ష కిట్ల లభ్యతపై విచారించి, అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.మందుల పంపిణీ గదిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, కారణాలను ప్రశ్నించారు. మందుల నిల్వ గదిని పరిశీలించి గడువు తేదీలను తనిఖీ చేశారు. మందుల నిల్వ గదిలో ఎయిర్ కండిషనింగ్ సదుపాయం కల్పించడం తో పాటు ఫార్మసిస్ట్‌ను నియమించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజలకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలి. అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి" అని తెలిపారు.గుండాల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా నిర్దిష్ట గడువులో కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న ఆర్ఓ ప్లాంట్ రెండు సంవత్సరాలుగా పనిచేయకపోవడాన్ని గమనించి, ఇప్పటికే మంజూరైన కొత్త ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. వంటకు మినరల్ వాటర్ వినియోగించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలపై వివరాలు తెలుసుకుని, హిందీ పరీక్షకు శు



భాకాంక్షలు తెలియజేశారు. డైనింగ్ హాల్ మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనను పరిశీలించి త్వరలోనే అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు.పర్యటనలో భాగంగా ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మందుల నిల్వలు, రికార్డులు, సిబ్బంది హాజరు, పశువులకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యతపై సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు పశువులపై ఆధారపడి జీవిస్తున్నందున, పశువులకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు సమయానికి వేయించడం, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక సేవలను బలోపేతం చేసి పశుపాలకులకు అవగాహన కార్యక్రమాలు

మిగతా 4లో

## రైల్వే పరిహారం చెల్లింపుపై కొలిక్కి చర్చలు

### భూమి మార్కెట్ ధరలు

### పరిగణలోకి తీసుకోవాలి:నిర్వాసితులు

### -భూసేకరణపై జేసీ తో సమావేశం

**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి) :** డోర్నకల్ – భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూసేకరించిన భూములకు రేటు విషయంపై భూ నిర్వాసితులు ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరితో మంగళవారం సమావేశమైనారు. సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాసితులు కోరిన రేటును నిర్ణయించేందుకు అధికారులు అంగీకరించకపోవడం చర్చలు కొలిక్కి రాలేదు. వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.91 లక్షల చొప్పున, ఇళ్ల స్థలాలకు గజానికి రూ.20వేల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్వాసితులు, అధికారులను కోరారు. ఆ రేటు సాధ్యపడధని అధికారులు తేల్చివేస్తూ వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.18 లక్షల , ఇళ్ల స్థలాలకు గజానికి రూ. 6300 చెల్లిస్తామని స్పష్టం చేశారు. నిర్మించిన ఇళ్ల విషయంలో మున్నీర్ అనే బాధితుడి ఇంటికి ఆర్ అండ్ బి అధికారుల ఎస్టిమేషన్ తో పాటు అదనంగా కల్పించే పరిహారంతో రూ.46 లక్షలు వస్తాయని ఉదాహరిస్తూ అధికారులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల భూసేకరణలో చెల్లించిన రేట్లనే



చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో దానికి నిర్వాసితులు అంగీకరించలేదు. నాన్ ఏజెన్సీ విషయంలో అక్కడి భూముల ధరలను కూడా పరిగణలోకి తీసుకొని మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని బాధితులు కోరారు. మరోసారి ఏర్పాటు చేసే సమావేశం నాటికి ఆలోచించుకొని నిర్ణయం తెలపాలని అధికారులు, నిర్వాసితులను కోరారు. రైతులు, ఇళ్ళు కోల్పోయిన వారు కోరిన విధంగా పరిహారాన్ని చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ) ఆధ్వర్యంలో జేసీ శ్రీనివాసరెడ్డి కి నిర్వాసితులు

మిగతా 4లో






## ఏప్రిల్ సమ్మెను విజయవంతం చేయండి

### ఏఐటీయూసీ కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి

**టీ మీడియా,మార్చి17,కొత్తగూడెం:** సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డు, సొంత ఇల్లు, ఐటీ రీయింబర్స్‌మెంట్ వంటి కీలక సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఏప్రిల్ నెలలో సమ్మెకు వెళ్తామని ఏఐటీయూసీ కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి హెచ్చరించారు. వీకే వర్క్‌షాప్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన అనంతరం పిట్ కార్యదర్శి మధు కృష్ణ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు రక్తాన్ని ధారపోసి సంస్థను లాభాల్లోకి తెస్తుంటే, యాజమాన్యం వారి సంక్షేమాన్ని విస్మరించడం తగదన్నారు.జూలై 2025 నుండి పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డులను వెంటనే సమీక్షించి, వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారుల తరహాలోనే కార్మికుల పర్క్స్ పై పడే ఆదాయపు పన్నును సంస్థే రీయింబర్స్ చేయాలని, సొంత ఇంటి పథకాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. పేరు మార్పులు, క్యాడర్ స్కీమ్ సవరణల వంటి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం.ఇందులో భాగంగా ఈనెల 17 నుండి 31 వరకు గోలేటి నుండి సత్తుపల్లి వరకు 'బస్ జాత' నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్ బేరర్లు సందేబోయిన శ్రీనివాస్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శి మధు కృష్ణ, కమిటీ సభ్యులు గుమ్మడి మురళి, రాజ కుమారస్వామి, కరుణాకర్, అశోక్, కిరణ్ కుమార్, దుర్గాప్రసాద్, కల్యాణ్, పీఆర్పీ రెడ్డి, సలిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

### -అదనపు కలెక్టర్ విద్యా చందన

**టీ మీడియా,మార్చి17,ములకలపల్లి:** మహిళలు స్వయం సహాయక సంఘాల నుంచి బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించినట్లయితే ఆ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి (అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు) విద్యా చందన తెలిపారు. మంగళవారం జగన్నాధపురం గ్రామ పంచాయతీ లో గల 28 స్వయం సహాయ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రతి మహిళ స్వయం సహాయక సంఘాల నుండి తీసుకున్న, బ్యాంకు లింకేజీ రుణాలను క్రమం తప్పకుండ చెల్లించినట్లయితే, ఆ సంఘాలకు వడ్డి లేని రుణాలు వస్తాయని, సభ్యురాలు అప్పు తీసుకొని సహజంగా మరణించినచో రెండు లక్షల భీమా, ప్రమాదము జరిగి మరణించినచో పది లక్షల ప్రమాద భీమా సౌకర్యం ఉందని, అలాగే ఆసక్తి ఉన్న సభ్యులు జీవనోపాదులు ఏర్పాటు చేసుకోనుటకు పి ఎం ఎఫ్ ఎం ఈ పి ఎం ఎం జి పి స్కీంల ద్వారా 35% సబ్సిడీ లతో రుణాలు మంజూరు చేస్తామని తెలియ చేసారు.జగన్నాధపురంలో 20 సంఘాలు నెల, నెల అప్పు చెల్లించకుండా క్రానిక్ సంఘాలు గా ఎందుకు ఉన్నాయి?ఎందుకు కట్టలేక పోయారని?సభ్యురాలి వారీగా మాట్లాడుతూ ఈ వారం రోజులలో బకాయిలలో సగం అమౌంట్ తప్పకుండ కట్టాలని ఈ విషయం లో ఎవరైన నిర్లక్ష్యం గా ఉన్న కఠిన చర్యలు తీసుకొని, రికవరీ తప్పకుండ చేపిస్తామని తెలియచేసారు.ఈ కార్యక్రమం లో డీపీఎం -సమ్మక్క, ఏపీఎం రామ్ కుమార్, సీసీ లు, స్త్రీనిధి ఏ ఎం , వివో ఏ లు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు



**టీ మీడియా,మార్చి17,దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం పర్ణశాల రైతు వేదికలో మంగళవారం సహజ వ్యవసాయంపై ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు సహజ వ్యవసాయం పద్ధతులు, ప్రయోజనాలు, ఖర్చు తగ్గింపు, నేల ఆరోగ్యం పరిరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. రైతులు సహజ వ్యవసాయాన్ని స్వీకరించి స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# సింగరేణిలో నల్లబ్యాడ్జీలతో నిరసన

### -అధికారులకు వినతి పత్రం

**టీ మీడియా,మార్చి17,కొత్తగూడెం:** సింగరేణిలో కార్మిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో కార్పొరేట్ ఏరియాలోని అన్ని డిపార్ట్మెంట్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు.సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆందోళన కార్యక్రమాలకు పిలుపిచ్చినట్లు చెప్పారు. కొన్ని సమస్యలనువ యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశాల్లో అంగీకరించిన ప్పటికీ ఇంత వరకు వాటి అమలుకు సర్క్యులర్ జారీ చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రధానంగా మారుపేర్లు, విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్కం టాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. యాజమాన్యం సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. భవిష్యత్ కార్యచరణపై వాల్పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 18 నుండి 30 వరకు గోలేటి నుండి కొత్తగూడెం వరకు బస్ జాతా ప్రారంభం అవుతుందని, 30న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను, ఏప్రిల్లో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపనిచ్చారు. జరగబోయే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు అంధిక సంఖ్యలో పాల్గొని సంస్థ మనుగడ కోసశీ పాటుపడాలని కోరారు.



## పైప్ లీకేజీలకు పరిష్కారమెప్పుడు?

**టీ మీడియా,మార్చి17,చుంచుపల్లి:** మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సిఎస్ఐ చర్చి సమీపంలో తాగునీటి పైపు లీకేజీ సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టినా, అవి పూర్తి స్థాయిలో ఫలించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి వచ్చే పైప్ లైన్ జాయింట్ లీక్ కావడంతో కొన్ని రోజుల పాటు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అనంతరం మరమ్మతులు చేపట్టినా వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ మళ్లీ లీక్ కావడంతో సమస్య మరింత తీవ్రమైంది. ఈ లీకేజీల కారణంగా ఆ ప్రాంతమంతా బురదగా మారి, నీరు గుంటలుగా నిల్వ ఉండిపోయింది. ఈ గుంటలలో పందులు తిరుగుతుండగా అదే నీటిని తాగే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు కలుషిత నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడింది.

పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బంది మధ్య సమన్వయం లోపించడంతో సమస్యలు పునరావృతమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పందులు తాగిన నీటినే తాము తాగాలా? అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే లీకేజీలను పూర్తిగా గుర్తించి శాశ్వత పరిష్కారం చూపి శుభ్రమైన నీరు అందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

## సర్పంచుల జిల్లా అధ్యక్షుడిగా కిశోర్ శివరాంనాయక్

**టీ మీడియా,మార్చి17, బూర్గంపహాడ్ :** సర్పంచుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా మేజర్ పంచాయతీ సారపాకకు చెందిన గుగులోత్ కిశోర్ శివరాంనాయక్ ఎన్నికయ్యారు. మంగళవారం భద్రాచలంలో జరిగిన రాష్ట్ర సర్పంచుల సంఘం సమావేశంలో రాష్ట్ర సంఘం బాధ్యులు ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సారపాక పంచాయతీ నుండి కిశోర్ భారీ మెజార్టీతో సర్పంచ్‌గా గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై మరింత బాధ్యత పెరిగిందని, రాష్ట్ర సంఘం ఇచ్చిన ఈ పదవికి వన్నెతెచ్చేలా జిల్లాలో సర్పంచులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో తనవంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ ఎన్నికయ్యారు.





## హామీల అమలులో వైఫల్యం.

### తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ నిరసన

**టీ మీడియా, మార్చి 17 ,కొణిజర్ల:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను, ఇతర హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండిపడింది. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంగళవారం కొణిజర్ల మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీజేపీ మండల అధ్యక్షులు కవిడ మురళీకృష్ణ నాయకత్వంలో పార్టీ శ్రేణులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా రైతు భరోసా, రుణమాఫీ, మహిళలకు నెలకు రూ. 2500 వంటి కీలక హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. మాయ మాటలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.అమ్మ హస్తం, ఉచిత విద్యుత్ వంటి పథకాలపై స్పష్టత లేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కవిడ రాంబాబు, మండల ఉపాధ్యక్షులు నోముల జనార్ధన్, పార్టీ నాయకులు చెర్ర నరేష్ తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, గ్రామ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా

## కూకలకుంట రవి



**టీ మీడియా,మార్చి17, సత్తుపల్లి:** సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కూకలకుంట రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా సాధు కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా వంకదారు రామకృష్ణ, కోశాధికారిగా కొప్పుల కేశవరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా నల్లగట్ల విజయకుమార్, స్పోర్ట్స్ గేమ్స్ జేవీ.నరేంద్ర, మహిళా ప్రతినిధిగా ఎస్కే.జీనత్ హస్సీనా, ఈసీ మెంబర్లుగా గుంట్రు శ్రీనివాసరావు, మోదుగు నరేష్ లను ఎన్నుకున్నారు.ఈనెల 26న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరపమని తెలంగాణ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. సత్తుపల్లిలో ఈనెల 9 నుంచి 11 వరకు నామినేషన్ ప్రక్రియ సాగగా 16న నామినేషన్లు ఉపసంహరణ కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారిగా ఎస్ లక్ష్మణరావు వ్యవహరించారు. కాగా ఉపాధ్యక్షుడి ఎన్నిక ఈనెల 26న జరుగనుంది. ఏప్రిల్ 1నుంచి ఏడాది వరకు ఈ నూతన కార్యవర్గం కొనసాగనుంది.




## గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**టీ మీడియా,మార్చి17, కొత్తగూడెం:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వేణుగోపాల్ మంగళవారం సుజాతనగర్‌లోని ఎంఎస్ సూర్య గ్యాస్ ఏజెన్సీ గోదాం కార్యాలయంను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బుకింగ్, పంపిణీ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు ఎల్పీజీ రీఫిల్ సిలిండర్లను సీనియారిటీ క్రమంలోనే పారదర్శకంగా అందజేయాలని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకూడదని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత విభాగాల అధికారులు, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.



## బోగ్గారపు కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**టీ మీడియా,మార్చి17,ఖమ్మం** :కార్పొరేషన్, ఇల్లందు రోడ్ లోని ప్రగతి ఫ్రైడ్ కాలనీకి చెందిన బొగ్గారపు రామయ్య ఇటీవల మరణించిన విషయం విధితమే కాగా మంగళవారం మధ్యాహ్నం బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వారి స్వగృహానికి వెళ్లి రామయ్య చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు. రామయ్య అల్లుడు మందటి నరేష్ చౌదరి, కుమార్తె కౌముదిని, కుమారులు రణధీర్, అభినవ్ తో పాటు వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ నామ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్ తో పాటు పొట్ల హరినాధ్ బాబు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ మన్నే బాలకృష్ణ, గుంటుపల్లి రఘు బాబు, యనమద్ది రాధాకృష్ణ, దేవభక్తుని హేమంత్, బీఆర్ఎస్ నాయకులు వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మోరంపూడి కు మాజీ ఎంపీ నామ నివాళి



**టీ మీడియా,మార్చి17,తల్లాడ :** తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఇఓ మోరంపూడి సత్యనారాయణ గారి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్వగృహానికి చేరుకుని సత్యనారాయణ గారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వారి సోదరుడు మోరంపూడి ప్రసాద్ రావు తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరు జీవన్ కుమార్, తల్లాడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, దుగ్గిదేవర అజయ్, బీఆర్ఎస్ నాయకులు నాయుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కనకయ్య పాల్గొన్నారు.

## భూమి లేకుండా పాసుబుక్కు కోట్ల రూపాయల లోన్



**టి మీడియా , మార్చి 17,ఖమ్మం రూరల్:**ఖమ్మం రూరల్ మండల డిసిసిబి బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. భూమి లేకపోయినప్పటికీ నకిలీ పట్టాదారు పాసుబుక్కులు సృష్టించి మార్టేజ్ లోన్ పొందిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.గూడూరుపాడు గ్రామానికి చెందిన బండి మల్లికార్జున్, తన భార్య బండి వెంకటలక్ష్మి పేరుమీద పిట్టలవారిగూడెం గ్రామంలోని పలు సర్వే నంబర్లలో సుమారు 3.29 ఎకరాల భూమిగా తప్పుడు రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అసలు రికార్డులు లేకపోయినా, సర్వే నెంబర్లు 71/1, 45/ ఈ, 64/ ఆ 53 / ఆ/ ఈ 59 రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ పత్రాలు సిద్ధం చేసి, వాటి ఆధారంగా బ్యాంకులో లోన్ పొందినట్లు సమాచారం.ఇందులో ప్రధానంగా బ్యాంక్ మేనేజర్, సూపర్వైజర్ పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూమి ఫీల్డ్ వెరిఫికేషన్ చేయకుండా, నకిలీ పత్రాలపై లోన్ మంజూరు చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.ఈ వ్యవహారంపై బాధితుడు గోకినపల్లి రామ్మూర్తి డిసిసిబి సీఈఓ కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. అలాగే వ్యవసాయ శాఖ ఏఈఓ నజీమా కౌశల్ కు అక్రమ పద్ధతిలో రైతుబంధు పొందుతున్నట్లు ఫిర్యాదు చేశాడు. బ్యాంకును తప్పుదోవ పట్టించి నకిలీ పత్రాలతో లోన్ పొందిన వారితో పాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు.

# స్మార్ట్ కిడ్జ్ లో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు




**టి మీడియా, మార్చి 17 ,ఖమ్మం** :స్థానిక స్మార్ట్ కిడ్జ పాఠశాలలో మంగళవారం ముందస్తు రంజాన్ పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పాఠశాల చిన్నారులు తమ మిత్రులకు ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు ఖర్జూరాలు,పండ్లు, సేమియాలు అందించి తమ ఆత్మీయ అనుబంధాన్ని చాటారు. మతసామరస్యానికి ప్రతీకగా పాఠశాలలో అన్ని తరగతుల విద్యార్థులు రంజాన్ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచమంతటా మతసామరస్యాన్ని చాటుతూ రంజాన్ వేడుకలను నిర్వహించి తోటి మానవుల పట్ల తమ ఆదరాభిమానాలను ప్రదర్శించే పండుగ రంజాన్ పర్వదినం అని పేర్కొన్నారు. కఠోర ఉపవాసాన్ని ఆచరించి చివరి రోజు ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. రంజాన్ మాసంలోనే పవిత్ర ఖురాన్ మత గ్రంథం దివి నుంచి భూమికి చేరిన పవిత్ర మాసం అని తెలియజేశారు. ఓర్పు,సహనం, త్యాగనిరతి,పరోపకారం,దానధర్మ భావనలు రంజాన్ పర్వదినం మనకి అందరికీ సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.






## శివాంజనేయ స్వామి ధ్వజ స్తంభానికి విరాళం

### కౌన్సిలర్ పెడకంటి సేవా స్ఫూర్తి

**టీ మీడియా,మార్చి17, కల్లూరు:** మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు కట్టపై వెలసిన శివాంజనేయ స్వామి వారి దేవాలయ ధ్వజస్తంభానికి 18వ వార్డు పుర కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ తన సేవా భావాన్ని చాటుకున్నారు.మంగళవారం ఆయన తన స్నేహితులతో కలిసి ఆలయాన్ని సందర్శించి, అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ధ్వజస్తంభ నిర్మాణానికి వితరణగా రూ.25 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా పట్టణానికి చెందిన కొటికలపూడి కళ్యాణ్ కిషోర్ కూడా తన వంతుగా రూ.10 వేల విరాళాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడిన పెడకంటి రామకృష్ణ, స్వామివారి సేవలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పెడకంటి రామకృష్ణ, కొటికలపూడి కళ్యాణ్ కిషోర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి రజనీకాంత్, గుగులోత్ బాలు సందీప్, బయ్యవరపు నరేంద్ర, వలసాల సూర్యనారాయణరావు, మోహన్ రావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 20 నుండి శ్రీ కోటమైసమ్మ బ్రహోత్సవాలు



**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి) :** కారేపల్లి మండల పరిధిలోని శ్రీ కోటమైసమ్మ దేవాలయంలో ఈనెల 20నుండి మూడు రోజుల పాటు పవిత్ర ప్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు, ఈఓ కె.వేణుగోపాలాచార్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణ యజుర్వేద పండితులు కొడమంచిలి ఫణికుమార్ ఆధ్వర్యంలో 20వ తేదిన మంగళవాయిద్యాలు, మంగళతోరణములు, మహావిద్యపాశుపతీయము ఉంటుందన్నారు. 21వ తేదిన శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి వారి మహాన్యాస పూర్వర ఏకాదశ రుద్రాభిషేకము జల బిందెల అభిషేకం, సామూహిక కుంకుమ పూజ, శ్రీమహా త్రిపుర సుందరి బ్రహ్మ విద్యా మాత్రయము, 22వ తేదిన మహాపుష్పార్చన, మహాపూర్ణహుతి నిర్వహించటం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల మూడు రోజులు దాతలు రావూస్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్, ఇల్లందు. శ్రీకాకతీయ స్కూల్, ఇల్లందు, సింగరేణి మర్చంట్స్ అసోసియేషన్, ఇల్లందు, జక్కుల రామకోటేశ్వరావు, సీఐ జక్కుల శంకర్ రావు, జక్కుల వెంకటగిరి కృష్ణారావు లచే అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.



## మోరంపూడి సత్యనారాయణకు సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నివాళులు

**టి మీడియా, మార్చి 17 ,తల్లాడ** :రిటైర్డ్ ఉపాధ్యాయుడు,మోరంపూడి సత్యనారాయణ ఈనెల 15వ తేదీన మరణించారు.మంగళవారం ఉదయం వారి స్వగృహం మిట్టపల్లిలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.... సత్యనారాయణ ఉమ్మడి ఖమ్మం జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శిగా జనవిజ్ఞాన వేదిక పర్యావరణం వ్యవసాయం సబ్ కమిటీ కన్వీనర్ గా నూతన వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడంతో పాటు సొంత వ్యవసాయ క్షేత్రంలో నూతన వంగడాలు నూతన పద్ధతులను అమలు చేసేవారు బీటీ పత్తి విత్తనాలను వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు సహకారంతో తయారు చేయించి కేవలం 100 రూపాయలకే మన జిల్లా రైతులకు అందజేసిన చరిత్ర మొరంపూడి సత్యనారాయణ అన్నారు. 1990 లో నిర్వహించబడిన అక్షరాస్యత ఉద్యమంలో జోనల్ కోఆర్డినేటర్ గాను రిసోర్స్ పర్సన్ గాను సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణ వెంకటేశ్వరరావు మాచర్ల భారతి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి మల్లెంపాటి వీరభద్రం, పారుపల్లి ఝాన్సీ,కె. దేవేంద్ర పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు,నెల్లూరు వీరబాబు, మచ్చా సూర్యంఏ. నాగేశ్వరావు, పురుషోత్తం,మాచర్ల గోపాల్ కళ్యాణపు కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కారేపల్లి జామే మసీదుకు ఏసీ వితరణ

**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి జామే మస్జిద్ కు దివంగత రైల్వే ఉద్యోగి షేక్ సర్దార్ జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.60 వేల విలువైన ఏయిర్ కండిషనర్ ను మంగళవారం వితరణ చేశారు. సర్దార్ కుమారులు షేక్ సద్దాం, ఆజం కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ముస్లిం పెద్దలకు అందజేశారు.ఈ సందర్భంగా దాతలను ముస్లిం పెద్దలు అభినందిచారు. ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్ పటేల్, ఉపాధ్యక్షులు షేక్ షఫీ, పాల్గొన్నారు.



# భూ కేటాయింపు త్వరితగతిన పూర్తిచేయాలి

**-జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా, మార్చి 17 ,భద్రాద్రి కొత్తగూడెం:**జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా అమలుకావాలంటే అవసరమైన భూమి కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో భూమి కేటాయింపు, భూమి అవసరాల అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల పరిధిలో అమలులో ఉన్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆయా శాఖల ద్వారా మంజూరైన పనుల వివరాలు, వాటి ప్రస్తుత పురోగతి, ఎప్పుడు మంజూరు అయ్యాయి, ఇప్పటివరకు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఏ పథకం కింద పనులకు మంజూరు లభించింది, పనుల అమలుకు ఎంత భూమి అవసరం ఉంది, భూమి కేటాయింపులో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, అటవీ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు.జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులు భూమి సమస్యల కారణంగా ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన భూమి గుర్తింపు, కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసి పనులు త్వరగా ప్రారంభం కావడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భూమి కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి వివరాలతో సమర్పించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అన్ని శాఖలు తమ శాఖల పరిధిలో అమలులో ఉన్న పనులపై సమగ్ర సమాచారం సేకరించి, మంజూరైన పనులు, వాటి పురోగతి, భూమి అవసరాలు, పెండింగ్‌కు కారణాలు వంటి అంశాలను వివరంగా పొందుపరుస్తూ నివేదికలను సిద్ధం చేసి జిల్లా పరిపాలనకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు త్వరగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు .ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా,



బీసీ సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్ రావు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఇల్లందు, అశ్వరావుపేట, మణుగూరు మున్సిపల్ కమిషనర్ లు జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, విద్యుత్, వ్యవసాయ, అటవీ, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హామీలకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

### కారేపల్లిలో సంక్షేమ పథకాల అభిప్రాయసేకరణ

**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లి లో మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.ఈసందర్భంగా కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను సాకుగా చూపి వాగ్దానాలను అమలు చేయకుండా తప్పించుకోవాలని చూడడం సరికాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సంక్షేమ పథకాల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2500, వృద్ధాప్య వితంతు పెన్షన్ రూ.4వేలు వికలాంగులకు రూ. 6వేలు, కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ రూ.లక్ష తో పాటు తులం బంగారం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ రూ.500, వ్యవసాయ కూలీలకు ఏడాదికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద రూ.12వేలు, రైతులకు రుణమాఫీ తో పాటు పెండింగులో ఉన్న రైతు భరోసా విడుదల చేయాలన్నారు.అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు, విద్యా, వైద్య రంగాన్ని మెరుగుపరచటం ద్వారా ప్రజల అభిమానాన్ని చూరగోనాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న స్కీమ్ వర్కర్ పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిజాయితీకి కట్టుబడాలన్నారు.హామీలు



వేగవేతకు ప్రయత్నిస్తే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కమిటీ మండల నాయకుల ముండ్ల ఏకాంబరం, కొండబోయిన ఉమావతి, తలారి దేవ ప్రకాష్, అన్నారపు కృష్ణ, పాసిని నాగేశ్వరరావు, కరకపల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.



## తీగల బంజారాలో ఉచిత వైద్య శిబిరం

**టీ మీడియా ,మార్చి 17 ,కొణిజర్ల:**పేదల ఆరోగ్యమే లక్ష్యంగా కొణిజర్ల మండలం తీగల బంజారా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నూనావత్ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్, సాయి రామ్ హాస్పిటల్స్ సంయుక్తంగా సహకారాన్ని అందించాయి.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీను మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో సుమారు వందలాది మంది గ్రామస్థులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.శిబిరంలో ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రియాంక (ఎండి), డాక్టర్ శ్రావణి (ఎంబిబిఎస్), డాక్టర్ రేణుక (ఎంబిబిఎస్) రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. అలాగే ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ భరత్ (బిపిటి) ప్రత్యేక చికిత్స అందించారు.ఈ కార్యక్రమంలో సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ డైరెక్టర్ సామ్యూల్ గెడ్డం, హాస్పిటల్ సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రతినిధులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తమ గ్రామంలోనే నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలు నిర్వహించడం పట్ల తీగల బంజారా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# టీ మీడియా కథనానికి స్పందన..

**-కదిలిన మండల విద్యాశాఖ అధికారి**

**-పాఠశాలలకు హెచ్చరికలు జారీ**



**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలంలో ప్రైవేట్ పాఠశాలల నిబంధనల ఉల్లంఘనపై ప్రచురితమైన టీ మీడియా కథనం ప్రభావం చూపింది. మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) స్పందించి చర్యలు ప్రారంభించారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణకు ఆదేశాలు జారీ చేసిన ఎంఈఓ, నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఉల్లంఘనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు నోటీసులు జారీ చేయడంతో పాటు, బాధ్యత వహించిన సిబ్బందిపై కూడా వివరణలు కోరినట్లు సమాచారం. ఇకపై యాజమాన్యాలపైనే ప్రత్యక్ష బాధ్యత మోపుతూ చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా, ప్రభుత్వం నిర్దేశించిన సెలవులను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఎంఈఓ ఆదేశించారు. పాఠశాలలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అన్నదానిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. టీ మీడియా కథనం తర్వాత అధికారులు కదిలి చర్యలు చేపట్టడం పట్ల తల్లిదండ్రులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తీరు కొనసాగించి విద్యా వ్యవస్థలో క్రమశిక్షణ తీసుకురావాలని కోరుతున్నారు.


టి-మీడియా
సామాజికం ... ప్రజల పక్షం...
epaper.www.tmedia.net.in
నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేట్ పాఠశాల




# డిప్యూటేషన్ బదిలీల గందరగోళం..

### అధికారులు మౌనం

**టీ మీడియా,మార్చి17,సింగరేణి(కారేపల్లి):**జిల్లాలో డిప్యూటేషన్ బదిలీల వ్యవహారం రోజురోజుకు వివాదాస్పదంగా మారుతున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించకుండా మౌనం పాటిస్తున్నారు. ఇప్పటికే అనుమానాస్పదంగా జరిగిన బదిలీలపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ, వాటిపై స్పష్టత ఇవ్వాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఉద్యోగ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా గతంలో జరిగిన బదిలీలలో సుమారు 200 మంది సొంత మండలాలకు వెళ్లినట్లు సమాచారం. ఇదే సమయంలో కొందరు గ్రామపంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను పక్కనబెట్టి ఇష్టానుసారంగా బదిలీలు నిర్వహించారని ఆరోపణలు వస్తున్నా, వాటిపై ఎలాంటి విచారణ లేకపోవడం గమనార్హం.ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని, లేదంటే ఈ వ్యవహారం మరింత ఉద్రిక్తతకు దారితీసే అవకాశముందని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు. పారదర్శకత లేకపోవడం, సమాధానం చెప్పే ధైర్యం లేకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తున్నదని వారు అంటున్నారు.

### గుండాలలో కలెక్టర్ తనిఖీలు

నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటిస్తూ పశువుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ ఖాసీమ్, మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపీడీవో బాలరాజు, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ నితిన్ సింగ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ సుధీర్, కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణ సంధ్య, బోధన సిబ్బంది, వైద్య సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదల

సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### రైల్వే పరిహారం చెల్లింపుపై కొలిక్కి చర్చలు

వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో సింగరేణి తహసిల్దార్ అనంతుల రమేష్, రైల్వే జేఈ శ్రీకాంత్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ జగదీష్, జీపీవో బంపర్, నిర్వాసితులు భీమవరపు శ్రీనివాసరావు, ముక్కా వెంకటేశ్వర్లు, సురేందర్‌మనియార్, ముండ్ల ఏకాంబరం, సోమందుల వెంకటేశ్వర్లు, భూక్యా శంకర్, పరిటాల మధు, రాసబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.